# పీటర్స్ ప్రిన్సిపుల్

"ఆధునిక సమాజంలో మనిషి తన అసమర్థత రుజువు చేసుకునే స్థితి వరకూ ఎదుగుతాడు."

బజార్లో ఒక పెన్ను కొనుక్కుంటే అది సరిగా రాయదు. సిరా కారిపోతూ వుంటుంది. చేతుల నిండా మరకలే. బల్బులు బోల్డు డబ్బుపోసి కొనితెస్తే అన్ని యిట్టే యిట్టే మాడిపోతూ వుంటాయి, మనసుపడి ఒక చీర కొనుక్కుంటే అది తడపగానే వెలిసిపోతుంది, రెడీమేడ్‌లో కొనుంటే ఒక ఉతుక్కే అవి పొట్టయిపోతాయి. టేబుల్ లైటు కొన్నామనుకోండి, దాని స్విచ్ సరిగా పనిచేయదు. ముట్టుకుంటే షాక్ తగులుతుంది. రిస్టు వాచీలు సరిగా తిరగవు. గోడ గడియారం తప్పుడు గంటలు కొడుతుంది, సైకిలు ట్యూబులు సరికొత్తవి తెచ్చినా వాటిలోంచి గాలి వెళ్లిపోతుంది. అదలా వుంచండి.

పాల డిపోవాడు కార్డున్న వాళ్లకు కూడా పాలులేవు. అయిపోయాయంటాడు. సిటీ బస్సు ఎక్కితే అది ఓ పట్టాన కదలదు. కదిల్తే మనం దిగవలసిన స్టాప్‌లో ఆగదు, ముందు డబ్బు యిచ్చినా టైలరుగాని లాండ్రీ వాలాగాని మన బట్టలు మనకు అనుకున్న టైముకి యివ్వరు. ఒక రైల్వే స్టేషన్‌కి పోస్టాఫీస్‌కికాని వెళ్లండి. అంతా యమ సీరియస్‌గా వుంటారు. ఒకడి దగ్గరికెళితే మరొకడి దగ్గర కెళ్లమంటారు. ఒకడునాకు తెలీదంటే మరొకడు మళ్లీ రమ్మంటాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిపడితే అక్కడ ఎవరైనా పెద్ద ఆఫీసరు తెలిసుంటే తప్ప కాగితం అటుదిటు కదలదు, ఇదంతా యేమిటి?

వీళ్ళంతా దొంగలు కారు. రాస్కెల్సు స్కౌండ్రల్సు అంతకంటే కారు. మనలాటి మామూలు మనుష్యులే! తలవంచుకుని తమ పని తాము చేసుకుపోతుంటారు. జీతాలు పుచ్చుకుంటూ వుంటారు. పనులు చేస్తూ వుంటారు, ప్రమోషన్లు పొందుతూ వుంటారు. ఏ పని ఎందుకు చేస్తున్నారో వారికి తెలీదు. అది వుపయోగించే పనోకాదో అంతకంటే తెలీదు.

ఈ దేశంలో తయారయ్యే వస్తువుల్లో గాని, మనుష్యుల్లోకాని చేసే పనుల్లో కాని ఎక్కడ చూసినా ఏదో ఓ రూపంలో కనిపించేది అసమర్థతే!

వ్యక్తులలోని అసమర్థతను కొలవడానికి పనికివచ్చే సిద్ధాంతాన్ని పీటర్స్ ప్రిన్సిపుల్ అంటార్ట. ప్రపంచంలోని అసమర్థతనంతా కొలవటానికి యీ సిద్ధాంతం పనికొస్తుందని మొన్న ప్రమోషను పోయినప్పుడు మా బావగారు చెప్పారు. మా బావగారంటే మా వరసక్కమొగుడు. మా వరసక్కా పరిమళంటే మీకుతెలీదా? అవున్లెండి - ఎలా తెలుస్తుంది? అదే వన్నా ఇందిరాగాంధీయా, బండారు నాయకీనా - కాని అది అంతటిదే మొన్న మొగుడ్ని చెప్పుచ్చుకొట్టిందంటారు, పాప పుణ్యాలైతే మనకి తెలీవుకాని ఆ మహానుభావుడు దాన్ని బెల్టుచ్చుకు బాదాడనీ అది తిరగబడి చెప్పుచ్చు కొట్టిందనీ, యిరుగు పొరుగు ప్రేక్షకులు చెప్పారు, వాళ్లది లౌమ్యారేజి,

దాని అసలు పేరు పార్వతి బాగులేదని పరిమళ అని అతనే ముద్దు పేరుపెట్టాడు. పార్వతి బియ్యస్సీ ఫిజిక్సు మీ అక్క ఫిజిక్సయితే నువ్వు కెమిస్ట్రీ కానక్కర్లేదా అని నన్నడక్కండి అది వరసక్క అని చెప్పాను కదాముందే, బైదిబై దానికి కుంపటి ముట్టించడం కూడారాదు, మా బావ యం, ఏ, ఫిలాసఫీ. కాని వంటబాగా వొచ్చు, ఏళ్ల తరబడి అతనావిడకి వంటనేర్పుదామని ట్రయిచేశాడు, ఆవిడ వంటనేర్చుకోకుండా వుందామని ట్రయిచేసింది, కాని మళ్లీ కొంతసేపు పోయాక ఒకరికొకరుసున్నం కొబ్బరి నూనెకలిపి రాసుకుంటూ వుంటారు. పరస్పర గాయాలకి. వారిది అన్యోన్య ముద్దు దాంపత్యం. ఒకమాటది మాబావను కండ వూడొచ్చేలా కొరికేసింది బుజంమీద. అదే డాక్టరు దగ్గరకు తీసికెళ్ళింది మనిషి కాటుకు మందులేదంటూ. అఫ్‌కోర్స్ దానికి కొంచెం పిచ్చి వుందనుకోండి. అప్పుడప్పుడు రెండు తగల్నీమని పెద్ద వాళ్ళెవరో చెప్పారు కాస్త భయం వుండాలని, అతను బెల్టుతీసుకుంటే అది చెప్పు తీసుకుంది. వినడానికి మనకిది కొత్తగా వుందికాని వారికిది అలవాటే. మా పరిమళక్క వంటచేయడం మానేసింది. పిల్లల్ని కనడం మానేసింది. స్కూలు నించొచ్చాక యిద్దరూ కాస్సేపు దెబ్బలాడుకుని కొట్టుకొని తరవాత ఒకరిమీదొకరు పడి యేడుస్తారు హ్వామై డార్లింగ్ అంటే "హ్వామై స్వీటి" అంటూ, సమస్యలు లేనివాళ్ళు కూడా యీ ప్రపంచంలో సుఖంగా వుండటం లేదు. సోషలిజంవస్తే కొన్ని సమస్యలుండవు కాని అప్పుడు కూడా మా బావా అక్కాలాటి వారుంటారు.

ఆయన మావారికో చింకి లెక్చరిస్తుండగా నేను ఈ అసమర్థతా సిద్ధాంతము గురించి చెవులొగ్గి విన్నాను. మగవాళ్ల మాటలు విండవే ఒక ఎడ్యుకేషను, మా బావ పీటర్స్ ప్రిన్సిపుల్ గురించి మా వారికి బోధపరుస్తున్నాడు. ఎవరి తెలివి తక్కువతనాన్ని వారు బయట పెట్టుకుని, దానికి ఏదైనా అతికే సూత్రం దొరికితే ఆనందంతో స్వీకరించడానికి యిద్దరూ సిద్ధంగా వున్నారని నేను గ్రహించాను.

మనుషుల్లో మూడు రకాల శాల్తీలుంటాయట. సమర్థులు, అత్యంత సమర్థులు, అసమర్థులూ అని, ఇందులో ఎవరి సంఖ్య ఎక్కువగా వుంటుందనేది వేరే అడగక్కర్లేదు.

ఏ సమాజంలోనైనా ఏ కాలంలోనైనా అన్ని వ్యాపకాల్లోనూ అసమర్థులే ఎక్కువగా వుంటారు. ఈ అసమర్థత బహురూపి.

వృత్తి ఉద్యోగాలలో ప్రతి వ్యక్తి తన అసమర్థతను నిరూపించుకునే స్థితివరకూ వచ్చి అక్కడ ఆగుతాడు. తన సమర్థత అంతరించి పోయేస్థితి వరకూ వ్యక్తి ఎదగాల్సిందే! మనిషికూడా నిత్యవ్యవహారంలో తన అయోగ్యత బయటపడే స్థితి వరకూ మాత్రమే పెరుగుతాడు. ఆ విధంగా చాలా పెద్ద పెద్ద జీతాలు పుచ్చుకునే బిగ్‌చాప్‌లందరూ తమ అయోగ్యత రుజువు చేసుకునే స్థితివరకూ వచ్చినవారే. పెరుగుట విరుగుట కొరకే.

ఇప్పుడు ఇందిరాగాంధీనే తీసుకోండి, ఈ సిద్ధాంతం ప్రకారం రాజకీయులను ధ్వంసం చేసే స్థితివరకూ ఆమె ఎదిగింది. ఇప్పుడున్న పోస్టులో ఆమె అయోగ్యతను ఆమె చేతులద్వారా

రుజువు చేసుకొంటుంది. ఇంతకంటె పెద్ద పదవి వుంటే ఆవిడ ఆ పోస్టులో తన అసమర్థతను రుజువు చేసుకుంటుంది.

అలాగే ఒక రచయితనుగాని రచయిత్రి కాని తీసుకోండి ఇంక యింతకంటె బాగా రాయలేని స్థితికి వచ్చి ఆ స్థితిలో వ్రాసే రచనలు ఒకే మూసలో పోసినట్లుగా తయారవటం మనం గమనిస్తున్నాము. అంటే కవులూ రచయితలూ కూడా పీటర్స్ ప్రిన్సిపుల్‌కి బలి అవుతారన్న మాట.

భార్యగా అసమర్థురాలైన స్త్రీ సంఘ సేవికగా రాణిస్తుంది.

ఇడ్డెన్లు బాగా వేయలేని పిల్ల ఉప్మాబాగా చేస్తుంది.

లెక్కెలురాని స్టూడెంటు వచన పద్యాలు జోరుగా రాస్తాడు.

కవిగా స్వయం ప్రతిభలేనివాడు జంటకవిగా రాణిస్తాడు.

కథలు బాగా వ్రాయలేనివారు, ప్రశ్నలకు జవాబులిస్తారు.

దీని అర్థం ఏమిటంటే ఒకరికి ఒక రంగంలో ప్రతిభ వుంటె అదంతా ఖర్చయే వరకూ ఆ శాఖ్తీ అభివృద్ధి చెంది మన దురదృష్టం కొద్దీ ఆఖరు దశలో అత్యున్నత స్థానం అలంకరించవచ్చు.

సమర్థత పైకి పోనుపోనూ క్షీణిస్తుంది, ఆఫీసు బోయ్‌గా పనిచేసేవాడు గుమాస్తాగా ఎందుకూ పనికి రాకపోవచ్చు, స్టూడెంటుగా బ్రిలియంట్‌గా వున్న అమ్మాయి ఇల్లాలుగా మిజరబుల్ కావచ్చు.

ఈ మనుషులలోని అసమర్థత అంతా విశ్వరూపం ధరించి మనసొసైటీలో క్షణ క్షణమూ ప్రత్యక్ష మవుతూవుంటుంది. ఎదగడం మానేసిన జాతియిలాగే వుంటుంది. అందుకే రైళ్లలో లైట్లు వెలగవు, వీధి దీపాలు వెలక్కపోయినా ఎవరూ పట్టించుకోరు, మన రోడ్లమీద త్రవ్విన గోతులు కనిపిస్తూవుంటాయి. ఒకమారు మ్యునిసిపాలికులు, ఒకమారు, ఎలక్ట్రిసిటీవారు. ఒకమారు పిడబ్ల్యుడి వారు ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా రోడ్లను త్రవ్వుతూ వుంటారు. ఈ సొసైటీలో ప్రతి అవకతవక పని పీటర్సు ప్రిన్సిపుల్ ప్రకారమే జరుగుతూ వుంటుంది, సంసారాలు కూడా చాలా అసమర్థంగా వుండడానికి కారణం పీటర్స్ ప్రిన్సిపులే.

ఈ లోకంలోని అవకతవకలన్నీ ఒక సూత్ర ప్రకారం జరుగుతున్నాయనుకుంటే దాన్నే పీటర్స్ ప్రిన్సిపుల్ అంటారు.

ఇద్దరు అసమర్థులూ చర్చించుకుంటున్నారు, దీపాలు హఠాత్తుగా ఆరిపోయాయి, సిగరెట్లు కాలుస్తూ మాట్లాడుకుంటూ గది అంతా పొగతో నింపేశారు, కరంట్ ఎందుకు పోయిందో తెలుసుకుందామని ఒకరికీ లేదు. చీకట్లో ఒంటరిగా కూర్చోటం భయంవేసి గట్టిగా కళ్లు మూసుకున్నారు.